60)దేసాక్షి/దేశి

ప॥ ఏమరక తలచరో యిదే చాలు। కామించినవియెల్ల గక్కున కలుగు॥

చ॥ దురితములెల్ల దీరు దుఃఖములెల్ల నణుగు। హరియని వొకమాటు అన్నా జాలు।
సురలు పూజింతురు సిరులెల్ల జేరును। మరుగురుని నామమటు పేరుకొన్న జాలు॥

చ॥ భవములన్నియుబాయు పరము నిహముజేరు। ఆవల నారాయణ యన్నా జాలు।
భువి యెల్లా దానేలు పుణ్యములన్నియు జేరు। తవిలి గోవిందునాత్మ దరచిన జాలు॥

చ॥ ఆనందము గలుగు నజ్ఞానమెల్లబాయు। ఆనుక శ్రీవేంకటేశ యన్నా జాలు।
యీనెపాన నారదాదులిందరు నిందకు సాక్షి। దానవారి మంత్ర జపతపమే చాలు॥